సాక్షి
కుమురం భీం
ఆదివారం । 22 । సెప్టెంబర్ । 2024



రైతన్నా.. జర భద్రం..!

రైతులు పంటలకు రసాయనిక మందులు పిచికారీ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఆస్పత్రుల పాలవుతున్నారు.

9లో▸

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ఉప కేంద్రం 33/11 కెవి ఎస్ఎస్‌లో మరమ్మతుల్లో భాగంగా ఆదివారం ఆసిఫాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ సహాయక అధికారి సదాశివ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గరిష్టం/కనిష్టం
32.2 /25.1

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. అల్పపీడనం ప్రభావంతో అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి



తమ్మినేని వీరభద్రంతో జిల్లా నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో పేరుకుపోయిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సీపీఎం నాయకులు శనివారం హైదరాబాద్‌లో ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ప్రాజెక్టులు ఉన్నా రైతులకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. కుమురంభీం ప్రాజెక్టు వర్షాలకు దెబ్బతిని మూడేళ్లు కావస్తున్నా నేటికీ మరమ్మతు చేయలేదన్నారు. ఆస్పత్రుల్లో వైద్యుల పోస్టులు భర్తీ చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యా వ్యవస్థ, వసతి గృహాలు, మారుమూల గ్రామాలకు రహదారులు, తదితర సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కూశన రాజన్న, కార్తీక్, దినకర్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

'కొండా' ఆశయసాధనకు కృషి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం రాజీలేని పోరాటం చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని, ఆయన ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పద్మశాలి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల ఆంజనేయులు అన్నారు. లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతి సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపూజీ విగ్రహ ఏర్పాటుకు కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. పద్మశాలీల్లో చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు కోమటిపల్లి లింగయ్య, శ్రీకాంత్, ఆవిడపు ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమం ఐఎన్‌టీయూసీతోనే సాధ్యం



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): కార్మికుల సంక్షేమం ఐఎన్‌టీయూసీతోనే సాధ్యమని ఆ యూనియన్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, కేంద్ర కమిటీ సభ్యులు ప్రకాష్ రావు అన్నారు. సింగరేణి కార్మికులకు లాభాల్లో వాటా ప్రకటించిన నేపథ్యంలో శనివారం గోలేటిటౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ కృషితో సింగరేణి కార్మికులకు లాభాల వాటా చెల్లించడంతో పాటు కాంట్రాక్టు కార్మికులకు సైతం లాభాల వాటా ప్రకటించారన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులను పట్టించుకున్న దాఖలాలు లేవని ఆరోపించారు. ఐఎన్‌టీయూసీ ఎల్లప్పుడు కార్మికుల సంక్షేమంతో పాటు సంస్థ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అనేక హామీలు అమలు చేసిందన్నారు. ఈకార్యక్రమంలో జీఎం ఆఫీస్ పిట్ కార్యదర్శి భీమేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పల్లాస్, నాయకులు దుర్గం రవీందర్, పూదరి సాయి, బాలునాయక్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలలకు పంపించాలి

కౌటాల: తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్ అన్నారు. శనివారం మండలంలోని ముత్తంపేట్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని, విద్యార్థులను తల్లిదండ్రులు చదువుల్లో ప్రోత్సహించాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు గావుడే హన్మంతు, మాజీ సర్పంచ్ ఆదే శ్రీనివాస్, సీఆర్పీ గంధం ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం

- స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేత
- పోలీసుల భారీ బందోబస్తు



ప్రధాన మార్కెట్‌లో మూసివేసిన దుకాణాలు

ఆసిఫాబాద్: జైనూర్‌లో ఆదివాసీ మహిళపై జరిగిన ఘటనకు నిరసనగా ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఇచ్చిన తెలంగాణ బంద్ పిలుపు మేరకు జిల్లా కేంద్రంతో పాటు ఏజెన్సీ మండలాల్లో ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని ఆసిఫాబాద్, వాంకిడి, కెరమెరి, జైనూర్, లింగాపూర్, తిర్యాణి, జైనూర్, సిర్పూర్(యూ)మండలాల్లో వ్యాపార, వాణిజ్య సంస్థలు, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. ఆదివాసీ సంఘాల పిలుపు మేరకు ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని సహకరించారు. ఎస్పీ డీవీ శ్రీనివాస రావు, అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, విజిలెన్స్ అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. ముందు జాగ్రత్తగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అడుగడుగునా పోలీసులు తనిఖీలు చేపట్టారు. జిల్లా కేంద్రంలో వ్యాపార, వాణిజ్య సంస్థలు, హోటళ్లు మూసివేశారు. మండల కేంద్రాల్లో పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం వారసంత అయినప్పటికీ వ్యాపార, వాణిజ్య సంస్థలతో పాటు కూరగాయల మార్కెట్ పూర్తిగా మూసివేశారు. కేవలం మెడికల్ షాపులు, పెట్రోల్ బంకులు మాత్రమే తెరిచి ఉంచారు. దీంతో మార్కెట్ నిర్మానుష్యంగా మారింది. జైనూర్‌లో 144 సెక్షన్ కొనసాగుతుండడంతో పాటు బంద్ ప్రశాంతంగా జరిగింది. కెరమెరిలో మెడికల్, టీ స్టాళ్లు మినహా అన్ని వ్యాపార సంస్థలు పూర్తిగా బంద్ పాటించాయి. తిర్యాణిలో వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. బంద్ నేపథ్యంలో అత్యవసరాలకు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

ఏజెన్సీ మండలాలకు బస్సులు బంద్

జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద సీఐ సతీశ్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బస్టాండ్‌లోనికి వాహనాలను అనుమతించలేదు. జిల్లా కేంద్రం నుండి ప్రతీరోజు వివిధ రూట్లలో 76 బస్సులు నడుస్తుండగా శనివారం 60 బస్సులు మాత్రమే నడిచాయి. బంద్ సందర్భంగా 16 బస్సులను రద్దు చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ విశ్వనాథ్ తెలిపారు. ఆదిలాబాద్, జైనూర్, కాగజ్‌నగర్ రూరల్ మినహా మిగితా అన్ని రూట్లలో బస్సులు యథావిధిగా నడిచాయి. ముందు జాగ్రత్తగా కేవలం కాగజ్‌నగర్ వరకు మాత్రమే బస్సులు నడపగా కాగజ్‌నగర్ నుండి గ్రామీణ ప్రాంతాలకు బస్సులు నిలిపివేశారు. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలు రవాణా సౌకర్యాలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. కొందరు ప్రయాణాలు వాయిదా వేసుకున్నారు.

అత్యాచార నిందితుడికి ఉరిశిక్ష వేయాలి



నినాదాలు చేస్తున్న ఆదివాసీ నాయకులు

ఆదివాసీ మహిళపై అత్యాచారం చేసిన నిందితుడికి ఉరిశిక్ష వేయాలని, లేనిపక్షంలో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కొమురంభీమ్ చౌక్ వద్ద ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైనూర్‌లో ఆదివాసీ మహిళపై అత్యాచారం, హత్యాయత్నం ఘటన బాధాకరమన్నారు. ఈ కేసులో ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితుడికి ఉరిశిక్ష విధించాలన్నారు. 1/70 చట్టం పకడ్బందీ గా అమలు చేయాలని, కబ్జాకు గురైన ఆదివాసీ భూములను ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోండ్వానా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆత్రం రాజ్‌కుమార్, గోండ్వానా ఫౌండేషన్ చైర్మన్ సిడాం తిరుపతి, తుడుందెబ్బ జిల్లా నాయకులు మడపచి భీమ్‌రావు, చహకటి రామ్‌కిషన్, చహకటి బాలు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలోని షిర్డీసాయి మందిర్ వద్ద..



మూసివేసిన జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్



ఆర్టీసీ బస్టాండ్ వద్ద పోలీసుల బందోబస్తు

దిందా వాగుపై వంతెన నిర్మిస్తాం

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

చింతలమానెపల్లి: దిందా వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి అటవీశాఖ నుంచి అనుమతులు తెస్తామని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. శనివారం మండలంలోని దిందా వాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీశాఖ అనుమతులు లేక వంతెన నిర్మాణ పనులు ప్రారంభం కావడం లేదన్నారు. కర్జెల్లీ–గూడెం రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామన్నారు. బాలజీ అనుకోడ గ్రామంలో సికిల్‌సెల్ వ్యాధితో బాధపడుతున్న చరణ్‌ను పరామర్శించారు. బాలుడి వ్యాధి నయం కావడానికి అవసరమైన చికిత్స చేయిస్తామన్నారు. ఆయన వెంట బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, మాజీ జెడ్పీటీసీ మల్లయ్య, నాయకులు మురళి, రమేశ్, భాస్కర్, తిరుపతి, నానయ్య, సుధాకర్, మనోహర్‌గౌడ్, నానాజీ, తదితరులు ఉన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న హరీశ్‌రావు

కాగజ్‌నగర్‌రూరల్: విద్యార్థి దశ నుంచే ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ఉండాలని ఐసీటీసీ కోఆర్డినేటర్ హరీశ్‌రావు అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు హెచ్‌ఐవి నియంత్రణపై ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపెయిన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవి నియంత్రణకు కృషి చేయాలన్నారు. కౌమారదశలో విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులు లైంగిక వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ప్రకాశ్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జయంతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు




మాట్లాడుతున్న మంత్రి సీతక్క

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

ఉట్నూర్‌రూరల్: తప్పు చేసిన వారికి చట్టపరంగా శిక్ష తప్పదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. శనివారం ఉట్నూర్‌కు విచ్చేసిన మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లాలోని గోండ్వానా పంచాయతీ రాయిసెంటర్లతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో శాంతియుత వాతావరణం నెలకొల్పాలని, ఈ మేరకు అందరూ సంయమనం పాటించాలన్నారు. జైనూర్ ఘటనపై ఆదివాసీ పెద్దలతో చర్చించి వారి అభిప్రాయాలు తీసుకున్నామన్నారు. బాధితురాలికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. విషయాన్ని సీఎం దృష్టికి సైతం తీసుకు వెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ గౌస్ ఆలం, ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మాట్, రాయిసెంటర్ల సార్‌మేడీలు, పటేళ్లు, ఆదివాసీ పెద్దలు పాల్గొన్నారు.

చెడు అలవాట్లే నేరాలకు కారణం

- జిల్లా జడ్జి ఎంవీ రమేశ్



మాట్లాడుతున్న జిల్లా జడ్జి రమేశ్

ఆసిఫాబాద్‌అర్బన్: తాత్కాలికంగా ఆనందాన్ని కలిగించే చెడు అలవాట్లే నేరాలకు మూలకారణం అవుతున్నాయని జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎంవీ రమేశ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రత్యేక సబ్ జైలులో 'ధ్యానంతో సంతోషకరమైన ఆరోగ్యవంతమైన జీవితం' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న అవగాహన సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు అలవాట్లకు దూరంగా ఉండి నేరప్రవృత్తిని తగ్గించుకోవాలన్నారు. ప్రవర్తనలో మార్పు వచ్చి కేసును కొట్టివేయించుకోవాలనే ఆలోచన వచ్చినవారు, క్షణికావేశంలో తప్పులు చేసి జైలులో ఉన్నవారు న్యాయవాదిని నియమించుకునే స్థోమత లేనివారు న్యాయ సేవాధికార సంస్థ నుంచి ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చన్నారు. ప్రతిరోజు ధ్యానం చేస్తూ దైవం పట్ల భక్తి భావం కలిగి ఉండాలని సూచించారు. ఖైదీల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ప్రేమ్‌కుమార్, డిప్యూటి లీగల్ ఎయిడ్ కౌన్సిల్ వెంకటేశ్వర్లు, జైలు అధికారులు, ఖైదీలు పాల్గొన్నారు.

అన్ని విభాగాల కార్మికులకు బోనస్ చెల్లించాలి

రెబ్బెన: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు ప్రకటించిన లాభాల వాటా బోనస్ రూ.5వేలను అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు చెల్లించాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబాల ఓదెలు డిమాండ్ చేశారు. శనివారం గోలేటిలో విలేకరులతో మాట్లాడుతూ సింగరేణిలో 25 వేలకు పైగా ఉన్న కాంట్రాక్టు కార్మికుల శ్రమ సంస్థ ఆర్జించిన లాభాల్లో ఉందన్నారు. సివిక్, నర్సరీ, సెక్యూరిటీ, క్యాంటీన్, ఓబీ, బ్లాస్టింగ్, కన్వేయన్స్ డ్రైవర్స్, బెల్ట్ క్లీనింగ్ వంటి వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రూ.5వేల బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆశాజనకంగా పంటలు

- చెరువులు, కుంటలకు జలకళ
- ఆయకట్టు కింద పూర్తిస్థాయిలో సాగు
- పూత, కాత దశకు చేరిన పత్తి
- కలిసి వచ్చిన వర్షాలు



గోలేటి రిజర్వాయర్ కింద ఆలస్యంగా సాగవుతున్న వరి పొలాలు



దహెగాంలో ఏపుగా పెరిగిన పత్తి మొక్కలు

రెబ్బెన/దహెగాం: గతేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులతో దిగుబడి రాక రైతన్నలు తీవ్రంగా నష్టపోయారు. పెట్టుబడులు కూడా రాక పీకల్లోతూ అప్పుల్లో కూరుకుపోయారు. అయితే ఈసారి వానాకాలం పంటలన్నీ ఆశాజనకంగా ఉండటంతో అన్నదాతల్లో కాస్త ఆనందం కనిపిస్తోంది. సీజన్ ప్రారంభం నుంచి కురిసిన వర్షాలకుతోడు ఇటీవల పడిన భారీ వర్షాలు పంటలకు ఉపయోగకరంగా మారాయి. చెరువులు, కుంటల్లోకి భారీగా వరద చేరడంతో ఆయ కట్టు కింద పూర్తిస్థాయిలో పంటల సాగు చేపట్టారు.

3.27 లక్షల ఎకరాల్లో పత్తి సాగు..

ప్రస్తుత వానాకాలం సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 3.27 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగైనట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అలాగే 62,209 ఎకరాల్లో వరి సాగైంది. పత్తి పంట సాగుచేసి వంద రోజులు దాటుతుండటంతో ప్రస్తుతం పూత, కాత దశలో ఉంది. మూడేళ్లుగా అతివృష్టి, అనావృష్టితో నష్టాలు ఎదురయ్యాయి. ఈ వానాకాలం ప్రారంభ సమయంలో వర్షాలు సమృద్ధిగా కురువకపోయినా గడిచిన రెండు నెలలుగా అనుకూలంగానే పడ్డాయి. తొలకరి వర్షాలకు ముందే పొడిదుక్కిలోనే విత్తనాలు విత్తుకోగా.. ప్రారంభంలో కురిసిన అరకొర వర్షాలతో విత్తనాలు సరిగా మొలకెత్తలేదు. దీంతో ఒక్కోరైతు రెండు, మూడుసార్లు విత్తుకోవాల్సి వచ్చింది. ఆపై పత్తి పంటకు అనుకూలంగా వర్షాలు పడటంతో మొక్కలు ఏపుగా పెరిగాయి. సీజన్ మధ్యలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు భూమిలో తేమశాతం పెరిగి కొన్నిప్రాంతాల్లో మొక్కల ఎదుగుదలపై ప్రభావం చూపింది. వర్షాలు కాస్త తగ్గుముఖం పట్టగానే రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటలు కాపాడుకున్నారు.

ధరపైనే ఆశలన్నీ..

పత్తి పంట సాగుచేస్తున్న రైతులంతా మార్కెట్ ధరపైనే ఆశలన్నీ పెట్టుకున్నారు. మరో రెండు నెలల్లో పత్తి దిగుబడి మొదలు కానుంది. కేంద్ర ప్రభుత్వం పత్తి కి అరకొరగా మద్దతు ధర పెంచడంతో మార్కె ట్ ధరపైనే ఆశలు పెట్టుకున్నారు. రెండేళ్ల క్రితం పత్తికి గరిష్టంగా క్వింటాల్‌కు రూ.9వేల వరకు ధర పలికింది. గతేడాది మాత్రం రూ.7 వేలకు మించలేదు. అలాగే సీజన్ చివరి దశలో వర్షాలు ముఖం చాటేయడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది. సగటు దిగుబడి ఎకరానికి 8 క్వింటాళ్లు ఉండగా గత సంవత్సరం ఎకరానికి ఐదు క్వింటాళ్లకు మించలేదు. గతేడాదితో పోల్చితే ఈసారి వర్షాలు సమృద్ధిగా పడటంతో దిగుబడి సైతం పెరుగుతుందని రైతులు భావిస్తున్నారు. దిగుబడికి తగిన ధర ఉంటే నష్టాలు పూడ్చుకోవచ్చని ఆశపడుతున్నారు.

పచ్చదోమ వ్యాప్తికి అవకాశం..

జిల్లావ్యాప్తంగా ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడింది. దీంతో పత్తి చేలలో కలుపు విపరీతంగా పెరిగింది. రైతులు పైమందులతో పాటు కలుపు నివారణకు గడ్డి మందులు పిచికారీ చేశారు. ప్రస్తుతం కలుపు బెడద నుంచి బయటపడ్డారు. ప్రసుతం ఎండతీవ్రతతో తెల్లదోమ, పచ్చదోమ వ్యాప్తి చెందే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. నివారణ కోసం కాన్ఫిడార్ లేదా కాఫర్ ఆక్సిక్లోరైడ్ మందు పిచికారీ చేయాలని సూచిస్తున్నారు. చల్లటి వాతావరణం ఉండే ఉదయం, సాయంత్రం వేళల్లో మందులు పిచికారీ చేయడం వల్ల ఈ దోమలు అరికట్టవచ్చని వారు పేర్కొంటున్నారు.

పెరిగిన వరిసాగు

జిల్లావ్యాప్తంగా ఈసారి వరిసాగు విస్తీర్ణం కొంత పెరిగింది. గతేడాది పూర్తిస్థాయిలో వర్షాలు లేక చెరువులు, కుంటల కింద పూర్తిస్థాయిలో వరి సాగు చేపట్టలేకపోయారు. ప్రస్తుతం అధిక వర్షాలతో చెరువులు, కుంటలు పూర్తిగా నిండాయి. ఆయకట్టు రైతులు వరిసాగు ఉత్సాహంగా చేపట్టారు. చెరువులు, కుంటల కింద ఆలస్యంగా వరినాట్లు వేయగా బోర్లు, మోటర్ల ద్వారా చేపట్టిన పంటలు పొట్టదశకు చేరుకున్నాయి. మరో రెండు నెలల్లో వరి ధాన్యం దిగుబడి సైతం రానుంది.

సూచనలు పాటించాలి

పత్తి సాగు చేసే రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడి సాధించాలి. ఎండల తీవ్రతతో పత్తికి తెల్ల, పచ్చ దోమ వచ్చే అవకాశం ఉంటుంది. స్థానిక ఏఈవోల సూచనల మేరకు పురుగుమందులు, ఇతర రసాయన మందులు వినియోగించాలి. ఎండ తీవ్రత ఉన్న సమయంలో కాకుండా ఉదయం, సాయంత్రం చల్లటి వాతావరణంలో మందులు పిచికారీ చేయాలి.– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి

లాభాల వాటా ఇప్పించిన ఘనత ఏఐటీయూసీదే



మాట్లాడుతున్న ఎస్.తిరుపతి

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి కార్మికులకు లాభాల వాటా ఇప్పించిన ఘనత ఏఐటీయూసీకే దక్కుతుందని యూనియన్ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి అన్నారు. శనివారం గోలేటి సీహెచ్‌పీలో ఏర్పాటు చేసి న గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి దసరాకు ముందే 33 శాతం లాభాల వాటా ఇప్పించడంతో పాటు కాంట్రాక్టు కార్మికులకు రూ.5వేల బో నస్ ఇప్పిస్తున్నామన్నారు. మొట్టమొదటగా 10 శాతం నుండి మొదలైన లాభాల్లో వాటా నేడు 33 శాతానికి చేరిందన్నారు. సమావేశంలో బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్యా మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఆనంద్, కిరణ్‌బాబు, పిట్ కార్యదర్శి అంబటి రామయ్య, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు సురేష్‌కోరి, వేణు, శ్రీనివాస్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ పోరాట ఫలితంగానే..

రెబ్బెన: సింగరేణి కాంట్రాక్టు కార్మికులు 20 ఏళ్లుగా అనేక పోరాటాలు, త్యాగాలు, అక్రమ కేసులను భరించి పోరాటాల ద్వారా నేడు లా భాల వాటా సాధించుకున్నారని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ అన్నారు. శనివారం కార్మికులకు స్వీట్లు తినిపించి సంబరాలు చేసుకున్నారు. సింగరేణి కార్మికులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి లాభాల వాటా చెల్లింపునకు కృషి చేసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

వందేభారత్, కేరళ ఎక్స్‌ప్రెస్ మంచిర్యాలలో నిలపాలి


రైల్వేస్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న ట్రస్మా బాధ్యులు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో కేరళ ఎక్స్‌ప్రెస్, వందేభారత్ రైళ్లను నిలపాలని ట్రస్మా ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ మేనేజర్ రవీందర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. రామగుండంతో పోల్చితే మంచిర్యాల రైల్వేస్టేషన్ ఐదు, ఆరు రెట్లు కంటే ఎక్కువగా రద్దీ, ఆదాయం సమకూరుతున్న విషయాన్ని దృష్టికి తీసుకువచ్చారు. నవంబర్, డిసెంబర్, జనవరిలో అయ్యప్ప భక్తులు వేలాది మంది మంచిర్యాల మీదుగా శబరికి వెళ్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ప్రయాణికుల సౌకర్యవంతంగా ఉండేలా మంచిర్యాలలో ఈ రైళ్లు ఆపాలని కోరారు. ట్రస్మా జిల్లా, రాష్ట్ర బాధ్యులు కస్తూరి పద్మచరణ్, విష్ణువర్ధన్‌రావు, దుర్గాప్రసాద్, ప్రశీన్ కుమార్, సాధిక్‌పాషా, ఉస్మాన్‌పాషా, థామస్, విక్రమ్‌రావు, బాలమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గేదె మృతి

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రానికి చెందిన మేకినేని శంకర్‌కు చెందిన గేదె పిడుగుపడి మృతిచెందింది. శుక్రవారం ఉదయం మేతకు వెళ్లిన గేదె రాత్రి అయినా తిరిగిరాలేదు. శనివారం ఉదయం వెతకుతుండగా గ్రామశివారులోని చేనులో మృతిచెంది కనిపించింది. దీని విలువ రూ.70 వేలు ఉంటుందని బాధితుడు శంకర్ తెలిపారు. పశువైద్యాధికారి సంపత్, ఆర్‌ఐ విజయలక్ష్మి పంచనామా నిర్వహించారు.

ఆటో బోల్తా..బాలుడి మృతి

భైంసారూరల్: మండలంలోని మాంజ్రి సమీపంలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడి నందగిరి వసీకర్ (11) మృతిచెందినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాలు..భైంసాకు చెందిన నందగిరి సాయినాథ్ భార్యపిల్లలతో కలిసి తన ఆటోలో శనివారం తానూరు వెళ్తున్నారు. అదే సమయంలో గాలులు వీచి ఉరుములు, మెరుపులతో వర్షం ప్రారంభమైంది. ఒక్కసారిగా బోల్తాపడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కుమారుడు వసీకర్‌ను కుటుంబీకులు భైంసా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా మృతిచెందినట్లు నిర్ధారించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చంపేశారు!?

- రిమ్స్ ఓటీటీ విద్యార్థి అనుమానాస్పదంగా మృతి
- విషం తాగించి, చితకబాదారని కుటుంబీకుల ఆరోపణ
- మృతదేహంతో రోడ్డుపై భైఠాయింపు
- బంధువుల ఆందోళన


జితేందర్ (ఫైల్)


విద్యార్థి సంఘాల రాస్తారోకో

ఆదిలాబాద్‌టౌన్/ఆదిలాబాద్‌రూరల్: చేతికి అందివచ్చిన కుమారుడు కష్టపడి చదివి ప్రయోజకుడు అవుతాడని భావించిన తల్లిదండ్రుల ఆశలు అడియాసలయ్యాయి. రిమ్స్‌లో బీఎస్సీ ప్రథమ సంవత్సరం ఓటీటీ చదువుతున్న విద్యార్థి శనివారం అనుమానాస్పదంగా మృతిచెందాడు. దీంతో కుటుంబ సభ్యులతోపాటు బంధువులు ఆందోళనకు దిగారు. తల్లిదండ్రులు కన్నీరు మున్నీరైన తీరును చూసి పలువురు కంటతడిపెట్టారు. కుటుంబానికి న్యాయం చేయాలని మృతదేహంతో ఆదిలాబాద్ బస్టాండ్ సమీపంలో రోడ్డుపై బైఠాయించారు. విద్యార్థి సంఘాలతోపాటు పలువురు మద్దతు ప్రకటించారు. విషం తాగించి, చితకబాదడంతో కుమారుడు మృతిచెందాడని, బాధ్యులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అసలేం జరిగిందంటే..

నార్నూర్ మండలం చోర్‌గావ్‌కు చెందిన ధన్వాస్ రాథోడ్–మీరాబాయి దంపతులకు ముగ్గురు కుమారులు. చిన్న కుమారుడు జితేందర్ (18) జిల్లా కేంద్రంలోని పిట్టలవాడలో గల ప్రభుత్వ గిరిజన బాలుర పోస్ట్‌మెట్రిక్ వసతి గృహంలో ఉంటూ రిమ్స్‌లో బీఎస్సీ ఓటీటీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. కుటుంబీకులు, స్నేహితులు తెలిపిన వివరాలు..శుక్రవారం రాత్రి 8 గంటలకు వసతి గృహంలో ఉన్న జితేందర్‌కు ఎవరో ఫోన్ చేసి బయటకు రావాలని పిలిచారు. గేటు వద్దకు వచ్చిన ఆయన్ను గుర్తుతెలియని నలుగురు బలవంతంగా వసతిగృహ సమీపంలోని నిర్మాణంలో ఉన్న భవనంపైకి తీసుకెళ్లారు. మద్యంలో విషం కలిపి తాగించి, చితకబాదడంతో స్పృహ కోల్పోయాడు. గంట తర్వాత స్పృహలోకి వచ్చి తోటి స్నేహితులు, తన బంధువుకు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పాడు.

ఊరివాళ్లే..

తమ ఊరికి చెందినవారే కుమారుడిని చంపి ఉంటారని కుటుంబీకులు ఆరోపించారు. ఇటీవల జరిగిన తీజ్ ఉత్సవాల్లో జరిగాయని పేర్కొన్నారు. ఆదిలాబాద్‌లోని ఓ కాలనీలో నివాసం ఉండే వారితో చితకబాది, విషం తాగించారని కుమారుడు చెప్పినట్లు కుటుంబీకులు పేర్కొన్నారు.

స్నేహితులు అక్కడికి చేరుకుని శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో రిమ్స్‌కు తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి రిఫర్ చేశారు. కుటుంబీకులు శనివారం ఉదయం ఆదిలాబాద్ బస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఆ విద్యార్థి మృతి చెందాడు.

విద్యార్థులకు రక్షణేది..

వసతి గృహంలో విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందని విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. బస్టాండ్ వద్ద ఏబీవీపీతోపాటు పలు సంఘాల నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఎస్టీ వసతి గృహంలో కనీసం నైట్ వాచ్‌మెన్ లేరని పేర్కొన్నారు. సీసీ కెమెరాలు లేకపోవడంతో ఎవరు వస్తున్నారో తెలియని పరిస్థితి ఉందన్నారు. హాస్టల్‌కు సంబంధించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కుటుంబీకుల ఆందోళన


కుటుంబీకులకు నచ్చజెప్పుతున్న పోలీసులు

అనుమానాస్పదంగా మృతిచెందిన ఆ విద్యార్థి కుటుంబీకులు, బంధువులు ఆందోళనకు దిగారు. మృతదేహాన్ని అంబులెన్స్‌లోకి ఎక్కించకుండా అడ్డుకున్నారు. ఆస్పత్రి వద్ద పెద్దఎత్తున గుమిగూడి ఆందోళన చేపట్టారు. బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రి నుంచి బయటకు శవాన్ని తీసుకుచ్చి అంబులెన్స్‌లో పోలీసులు ఎక్కించేందుకు యత్నించగా అడ్డుకున్నారు. కొంత సేపు ఉద్రిక్తత నెలకొంది. బలవంతంగా మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఎక్కించిన తర్వాత వాహనాన్ని అడ్డుకున్నారు. బస్టాండ్ ప్రాంతంలో శవంతోపాటు భైఠాయించారు. ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఆర్డీవో వినోద్‌కుమార్, సీఐలు సునీల్‌కుమార్, కరుణాకర్‌రావులు కుటుంబీకులకు నచ్చజెప్పినా వినకుండా భీష్మించుకూర్చున్నారు. ఇదిలా ఉండగా శనివారం మధ్యాహ్న సమయంలో ఆదిలాబాద్ డీఎస్పీ, రూరల్ సీఐ ఫణిందర్, మావల ఎస్సై విష్ణువర్ధన్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. తోటి విద్యార్థులను విచారించారు. మృతుడి సోదరుడు అజయ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మావల ఎస్సై తెలిపారు.

సంస్కృతి సంప్రదాయాలు కాపాడాలి

- ఎంపీ గోడం నగేశ్


సురేశ్ మహారాజ్‌తో ఎంపీ నగేశ్, తదితరులు

ఇంద్రవెల్లి: సంస్కృతి సంప్రదాయాలు కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. మండలంలోని ఏమాయికుంట గ్రామంలో శనివారం నిర్వహించిన రుషి పంచమి ఉత్సవాల్లో సాయంత్రం పాల్గొన్నారు. ముందుగా కాలుబాబా ఆలయంలో పూజలు నిర్వహించారు. సురేష్ మహారాజ్ నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 గని వద్ద మైనింగ్ స్టాఫ్ ఉద్యోగులు శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి అసిస్టెంట్ సెక్రెటరీ మోత్కూరి కొమురయ్య తన వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. మైనింగ్ స్టాఫ్ విధుల్లో జోక్యం చేసుకుంటూ లెక్కపంచే క్రమంలో జోక్యం చేసుకుంటూ తమను ఇబ్బందికి గురిచేస్తున్నారన్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని తెలిపారు. ఆయన చెప్పినా వారికి, వారు కోరిన పనులకు పురమాయించాలని ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. విధుల్లో ఆయన జోక్యం చేసుకోవడం సరికాదన్నారు. ఈ నిరసనకు సీఐటీయూ బ్రాంచి అధ్యక్షుడు బాలాజీ, కార్యదర్శి శ్రీను మద్దతు తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతి


ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు

- ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన
- భర్త ఫిర్యాదుతో కేసు నమోదు

నిర్మల్‌టౌన్: వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతిచెందిన ఘటన జిల్లాకేంద్రంలోని చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని షేక్ సాహెబ్‌పేట్‌కు చెందిన అఫ్రోజ్ అహ్మద్ ఖాన్ తన భార్య ఫర్హనాజ్ (37)కు పురిటినొప్పులు రావడంతో శుక్రవారం మధ్యాహ్నం బస్టాండ్ సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యురాలు..ఆమెను పరీక్షించి సిజేరియన్ ఆపరేషన్ చేయగా పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. డెలివరీ తర్వాత ఆమెకు అధిక రక్తస్రావమైంది. వెంటనే అక్కడి నుంచి మరో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వైద్యులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. కుటుంబ సభ్యులు ఆమెను అక్కడికి వెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. శనివారం మృతదేహంతో నిర్మల్‌లోని ఆస్పత్రి వద్దకు చేరుకుని భర్త, కుటుంబీకులు, బంధువులు ధర్నా చేశారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలింత మృతి చెందిందని ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. భర్త ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపట్టినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. సుమారు 5 గంటల వరకు ధర్నా కొనసాగడంతో ట్రాఫిక్ ఏర్పడింది.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


రుతుజరెడ్డి (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో ఓ మహిళ ఘటన స్థలంలో మృతిచెందిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు, బంధువుల వివరాల ప్రకారం..తలమడుగు మండలం ఖోడద్ గ్రామానికి చెందిన ఎల్మ రాకేశ్‌రెడ్డి, రుతుజరెడ్డిలు ద్వారకానగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. శనివారం సాయంత్రం ఆదిలాబాద్ నుంచి జైనథ్ మండలంలోని దీపాయిగూడకు బైక్‌పై వెళ్తున్నారు. తిర్పెల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ వీరి వాహనాన్ని ఢీకొంది. దీంతో తలకు తీవ్ర గాయాలై రుతుజ (30) ఘటన స్థలంలో మృతిచెందింది. భర్త రాకేశ్‌రెడ్డితోపాటు చిన్న కూతురు (ఏడాదిన్నర వయస్సు గల) టియారాకు స్వల్ప గాయాలయ్యాయి. మృతురాలికి నాలుగున్నరేళ్ల కూతురు అరుణ్య ఉంది. ఈమేరకు టుటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు, బంధువులు రిమ్స్‌కు చేరుకున్నారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

నర్సాపూర్(జి): పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్సై హన్మాండ్లు కథనం ప్రకారం..మండలంలోని గొల్లమాడకు చెందిన పొట్ట గజ్జారాం (70) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల్లో చికిత్స పొందినా తగ్గకపోవడంతో మనస్తాపం చెందాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు భైంసా ఏరియాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. పెద్ద కుమారుడు రవి ఫిర్యాదుతో శనివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య సత్తవ్వ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

పిడుగుపాటుకు వ్యవసాయ కూలీ మృతి

బేల: మండలంలోని సిర్సన్న రెవెన్యూ గ్రామశివారులోని ఓ చేనులో పిడుగుపాటుకు శనివారం వ్యవసాయ కూలీ రాథోడ్ అవినాష్(22) మృతిచెందాడు. కూలీ పనికి వెళ్లి తిరిగివస్తుండగా సమీపంలో పిడుగుపడింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి..

కాసిపేట: చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందినట్లు దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు తెలిపార. ఆయన కథనం ప్రకారం..మండలంలోని కొండాపూర్ యాపకు చెందిన వెంకటేశ్(32) బుధవారం మల్కెపల్లి శివారులోని పంట చేనులో గడ్డి మందు తాగాడు. కొద్దిసేపటికి ఇంటికి రావడంతో గమనించిన కుటుంబీకులు ఆదిలాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండడం, ఇటీవల ఆపరేషన్ చేయించుకున్నాడు. ఇటీవల తీవ్ర మానసిక వేదనకు గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు మురుగుకాల్వలో పడి..

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సుభాష్‌చంద్రకాలనీకి చెందిన మిరిదొడ్డి శంకర్ (56 మురుగుకాల్వలో పడి మృతిచెందాడు. ఎస్సై సుధాకర్ కథనం ప్రకారం..శుక్రవారం రాత్రి ఇంటి పని నిమిత్తం సైకిల్‌పై మార్కెట్‌కు వెళ్లారు. తిరిగి వస్తుండగా మురుగుకాల్వలో పడి మృతి చెందాడు. శనివారం ఉదయం మురుగుకాల్వలో పడి ఉన్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతుడి భార్య తార ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మికులకు బోనస్ చెల్లించాలి

- హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్


మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంటు కాంట్రాక్టు కార్మికులకు బోనస్‌గా రూ.10 వేలు చెల్లించాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్టీపీపీ హెచ్ఎంఎస్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ చిప్పకుర్తి సంపత్‌తో కలిసి ఆయన మాట్లాడారు. సింగరేణి ప్రకటించిన లాభాల బోనస్‌ను ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మి కులకు వర్తింపజేయాలన్నారు. యాజమాన్యం ఏటా ఎస్టీపీపీ నుంచి వేలకోట్ల లాభా లు ఆర్జిస్తున్నప్పటికి రాత్రింబవళ్లు విద్యుత్ ఉత్పత్తికి కష్టపడుతున్న కార్మికులకు ఎలాంటి బోనస్ చెల్లించకపోవడం బాధాకరమన్నా రు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులకు ప్రకటించిన రూ.5వేల బోనస్‌ను పవర్ ప్లాంటు కార్మికులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హెచ్ఎంఎస్ నాయకులు నవీన్, ఎండీ.హజార్‌పాషా, అంజి, తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌హెచ్‌ఓ దేవయ్య

బెల్లంపల్లి: ఓ యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ దేవయ్య తెలిపారు. బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. వినాయక నిమజ్జనం రోజున బెల్లంపల్లి హన్మాన్ బస్తీకి చెందిన వేల్పుల శ్రావణ్‌పై ఈనెల 16న రాసబత్తుల గణేశ్(బెల్లంపల్లి), గుగ్లస్ శ్రీనివాస్ (మహారాష్ట్ర) అలియాస్ రామటెంకి శ్రీనివాస్ కత్తితో దాడి చేసి గాయపర్చారు. ఈ ఘటనలో శ్రావణ్‌కు గాయాలయ్యాయని, పాత కక్షల కారణంగానే దాడి జరిగినట్లు ఎస్‌హెచ్‌ఓ వివరించారు. ఈమేరకు నిందితులిద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చామని తెలిపారు. ఈ సమావేశంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రోద్బలంతోనే భవనం కూల్చివేత

- ఇంట్లోనే రూ.20లక్షల నగదు, 30 తులాల బంగారం
- త్వరలో హైకోర్టును ఆశ్రయిస్తాను
- టీబీజీకేఎస్ మాజీ నాయకుడు దీకొండ అన్నయ్య



మాట్లాడుతున్న దీకొండ అన్నయ్య

నస్పూర్: తన భవన నిర్మాణానికి అనుమతులు ఉన్నా రాజకీయ ప్రోద్బలంతోనే అధికారులు కూల్చివేశారని టీబీజీకేఎస్ మాజీనాయకుడు దీకొండ అన్నయ్య ఆరోపించారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2019లో న స్పూర్ శివారు సర్వేనంబర్ 40/2లో 350 గజాలను పొనుగంటి ప్రేమలత వద్ద నుంచి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించానని తెలిపారు. 2021లో మున్సిపల్ పర్మిషన్ తీసుకుని ఇంటిని నిర్మించినట్లు పేర్కొన్నారు. 2023లో అధికారులు ఇంటి నంబర్ కేటాయించగా రూ.34,330 ఇంటి పన్ను చెల్లించానన్నారు. 2022లో నోటీసులు జారీ చేసినప్పుడు హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. గత జూన్‌లో, 15 రోజుల క్రితం నోటీసులు జారీ చేశారని కమిషనర్ సతీశ్ అనడం అవాస్తవమన్నారు. ఇంటిని కూల్చే ముందు సామగ్రి తీసుకునే సమయం ఇవ్వలేదన్నారు. పోలీసులు తనను, కుమారుడు, కుటుంబ సభ్యులను బలవంతంగా పోలీస్‌స్టేషన్‌కి తరలించారని ఆరోపించారు. దళితుడి అయిన తనపై రాజకీయకక్ష సాధింపులో భాగంగా రూ.2. కోట్లు విలువ గల భవనాన్ని నేల మట్టం చేశారని ఆరోపించారు. ఇంట్లోనే రూ.20 లక్షల నగదు, 30 తులాల బంగారు ఆభరణాలు, స్టడీ సర్టిఫికేట్లు, డాక్యుమెంట్లు, రూ 60 లక్షలు విలువ చేసే సామగ్రి ఉండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో హైకోర్టును ఆశ్రయిస్తానని తెలిపారు. సమావేశంలో అన్నయ్య కుమారుడు నవీన్‌కుమార్, అల్లుళ్లు రాజ్‌కుమార్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

లాభాల వాటా పంపిణీలో అన్యాయం


మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థకు గత ఆర్థిక సంవత్సరం వచ్చిన వాస్తవ లాభాల్లో నుంచి వాటా పంపిణీలో కార్మికులకు అన్యాయం జరుగుతుందని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి తెలిపారు. వాస్తవ లాభాల్లో నుంచి 33 శాతం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. మందమర్రిలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరం సింగరేణికి రూ.4,071 కోట్ల లాభాలు వస్తే రూ.2,412 కోట్లలో 33 శాతం లాభాలు పంపిణీ చేయడం ఏంటని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ మామూళ్ల కింద రూ.2,289 కోట్లు పక్కన పెట్టిందని ఆరోపించారు. కేసీఆర్ సీఎంగా, టీబీజీకేఎస్ గుర్తింపు కార్మిక సంఘంగా ఉన్నప్పుడు వాస్తవ లాభాల్లో నుంచి పెట్టుబడి పేరిట కోత విధించలేదని గుర్తుచేశారు. గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు రాజకీయ ప్రలోభాలకు తలొగ్గి కార్మికులకు నష్టం కలిగిస్తున్నారని మండిపడ్డారు. ఇదివరకు జరిగిన ఒప్పందం మేరకే కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటాలో రూ.5 వేలు ఇస్తున్నారని తెలిపారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపెల్లి సంపత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామమూర్తి, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వెంకటరమణ, నాయకులు రవీందర్, రాజశేఖర్, బడికెల సంపత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్బీఐలో చోరీకి యత్నించిన దొంగల అరెస్టు

- వారం రోజుల్లో కేసు ఛేదించిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ మల్లేశ్

ముధోల్: మండల కేంద్రంలోని ఎస్బీఐలో ఈనెల 13న చోరీకి యత్నించిన దొంగలను అరెస్టు చేసినట్లు సీఐ మల్లేశ్ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో సీఐ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. పాత బస్టాండ్ సమీపంలో గల ఎస్బీఐ వెనుకభాగంలో వెంటిలేటర్‌కు ఉన్న ఇనుపచువ్వలు తొలగించి చొరబడ్డారు. సీసీ కెమెరాలు, అలారం వైర్లు కత్తిరించి చోరీకి యత్నించి విఫలమయ్యారు. ఎస్సై కిరణ్‌కుమార్, సిబ్బందితో కలిసి రెండు టీంలు ఏర్పాటు చేసి కేసు దర్యాప్తు చేశారు. సీసీపుటేజీలను పరిశీలించారు. ముధోల్‌కు చెందిన షేక్ మోసిన్ అహ్మద్, మమ్మద్ ఇర్ఫాన్ ఉద్దీన్‌లను గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. వారం రోజుల్లో కేసు ఛేదించిన పోలీసులను సీఐ అభినందించారు. అనంతరం సీఐ మల్లేశ్, ఎస్సై సాయికిరణ్‌లను ఎస్బీఐ మేనేజర్ వి.గిరి సన్మానించారు.

పార్కు కాదు.. కోనేరు




బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయం. అధికారుల నిర్లక్ష్యంతో కోనేరు వ్యర్థాలతో నిండి కంపుకొడుతోంది. చెత్తాచెదారం కోనేరు పక్కనే వేసి కాల్చివేస్తున్నారు. దీంతో పొగతో ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఇక కోనేరు నిండా.. నాచు, పిచ్చిమొక్కలు పెరగడంతో ఇలా పచ్చగా కనిపిస్తోంది. బతుకమ్మ పండుగ సందర్భంగా పట్టణంలోని మహిళలు బతుకమ్మలను ఆలయం కోనేటిలోనే నిమజ్జనం చేస్తారు. మిగతా రోజుల్లో కోనేటిని ఎవరూ పట్టించుకోరు. దీంతో ఇలా గుర్రపుడెక్కతో నిండియింది. ఏటా గంగపుత్రులతో పుష్కరిణిని శుభ్రం చేయిస్తారు. గతేడాది శుభ్రం చేయించిన డబ్బులు పూర్తిగా చెల్లించకపోవడంతో ఈసారి శుభ్రం చేయడానికి వారు రావడం లేదని తెలిసింది. బతుకమ్మ పండుగ నేపథ్యంలో కోనేరు శుభ్రం చేయించాలని పట్టణ మహిళలు కోరుతున్నారు.